అమ్మాయిల పొట్టి పోరుకు ముహూర్తం

మహిళల టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ విడుదల

జూన్ 12 నుంచి జులై 5 దాకా మెగా టోర్నీ

పాక్ మ్యాచ్‌తో వేట ఆరంభించనున్న భారత్

దుబాయ్: క్రికెట్ అభిమానులకు వరుస ఏడాదుల్లో మెగా టోర్నీల మజాను అందించడానికి ఐసీసీ సిద్ధమైంది. ఈ ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించతలపెట్టిన మహిళల వన్డే ప్రపంచకప్‌నకు ఇటీవలే షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. తాజాగా వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వబోతున్న మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్‌నూ విడుదల చేసింది. జూన్ 12 నుంచి మొదలుకాబోయే ఈ మెగా టోర్నీ జులై 5న క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్ వేదికగా జరుగబోయే ఫైనల్‌తో ముగుస్తుంది. ఏడు వేదికల్లో 12 జట్లు తలపడనున్న ఈ ధనాధన్ పోరులో.. జూన్ 30న తొలి, జులై 2న రెండో సెమీస్ జరుగనుంది. ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్, హాంప్‌షైర్ బౌల్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫర్డ్, ది ఓవల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్స్, లార్డ్స్‌లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. జూన్ 12న ఆతిథ్య ఇంగ్లండ్.. ఎడ్జ్‌బాస్టన్‌లో శ్రీలంకతో జరుగబోయే మ్యాచ్‌తో టోర్నీ మొదలవనుంది. భారత జట్టు దాయాది పాకిస్థాన్‌తో జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జూన్ 28న లార్డ్స్‌లో జరిగే మ్యాచ్‌తో లీగ్ దశకు తెరపడనుంది.

భారత షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జూన్ 14	పాకిస్థాన్	ఎడ్జ్‌బాస్టన్
జూన్ 17	క్వాలిఫయర్	హెడింగ్లీ
జూన్ 21	దక్షిణాఫ్రికా	ఓల్డ్ ట్రాఫర్డ్
జూన్ 25	క్వాలిఫయర్	ఓల్డ్ ట్రాఫర్డ్
జూన్ 28	ఆస్ట్రేలియా	లార్డ్స్

రెండు గ్రూపులు

12 జట్లు పాల్గొననున్న ఈ టోర్నీలో జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో ఆరుసార్లు విజేత ఆస్ట్రేలియా, నిరుటి ఎడిషన్ రన్నరన్ దక్షిణాఫ్రికా, భారత్, పాకిస్థాన్‌తో పాటు రెండు క్వాలిఫయింగ్ టీమ్స్ (ఇంకా ఖరారు కాలేదు) ఉండగా.. గ్రూప్-2లో డిఫెండింగ్ చాంపియన్స్ న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఇంగ్లండ్, రెండు క్వాలిఫయింగ్ టీమ్స్ ఉన్నాయి. లీగ్ దశ ముగిసేసరికి గ్రూప్‌లో టాప్-2లో ఉన్న నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

క్విటోవా వైల్డ్ కార్డ్ ఎంట్రీ

లండన్: ఈ నెలాఖరున మొదలుకాబోయే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో రెండుసార్లు మహిళల సింగిల్స్ విజేత పెట్ర క్విటోవ (చెక్ రిపబ్లిక్) ఈ ఏడాది వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా టోర్నీలోకి ఎంట్రీ ఇవ్వనుంది. 2011, 2014లో చాంపియన్‌గా నిలిచిన క్విటోవ.. చివరి సారిగా 2023లో ఈ టోర్నీ ఆడింది. నిరుడు కొడుకుకు జన్మనివ్వడంతో ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి దూరంగా ఉన్న ఆమె.. ఈ టోర్నీలో బ్రిటన్ ఆటగాళ్ల తర్వాత వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా వచ్చిన తొలి ప్లేయర్‌గా నిలిచింది.

లండన్‌కు సూర్యకుమార్

- స్పోర్ట్స్‌హెర్నియాకు చికిత్స

ఢిల్లీ: టీమ్‌ఇండియా టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్ వెళ్లాడు. కొంతకాలంగా స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడుతున్న సూర్య.. లండన్‌లో సంబంధిత స్పెషలిస్ట్‌ను కలిసి అతడి వద్ద వైద్య పరీక్షలు చేయించుకోనున్నాడు. ఒకవేళ అవసరమైతే అతడు శస్త్రచికిత్సకు వెళ్లే అవకాశమున్నట్టు సూర్య సంబంధీకులు తెలిపారు. 'సూర్య కుడి పొత్తి కడుపులో స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడుతున్నాడు. కన్సల్టేషన్ కోసం అతడు లండన్ వెళ్లాడు. అవసరమైతే అతడు శస్త్రచికిత్స చేసుకుంటాడు' అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత టీ20 జట్టుకు ఆగస్టు-సెప్టెంబర్ దాకా ద్వైపాక్షిక సిరీస్‌లు ఏమీ లేవు. ఈ నేపథ్యంలో ఆ లోపు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించాలని సూర్య భావిస్తున్నట్టు సమాచారం.

తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు ప్రకటన

లీడ్స్: స్వదేశంలో భారత్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా శుక్రవారం నుంచి మొదలుకానున్న తొలి టెస్టుకు ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్.. ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు, ఒకే ఒక స్పిన్నర్, ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగనుంది.

ఇంగ్లండ్ తుది జట్టు: జాక్ క్రాలె, బెన్ డకెట్, ఒలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జెమీ స్మిత్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్

కూర్పుపై కసరత్తు

భారత క్రికెట్ జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనున్న టీమ్‌ఇండియా అస్త్రశస్త్రాలతో సన్నద్ధమైంది. ఇంగ్లండ్ గడ్డపై ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న టెస్టు సిరీస్‌ను ఎలాగైనా ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న భారత్ అందుకు తగ్గట్లు పావులు కదుపుతున్నది. దిగ్గజ త్రయం రోహిత్, కోహ్లీ, అశ్విన్ వీడ్కోలు వేళ అంతగా అనుభవం లేని జట్టుతో బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా..శుక్రవారం నుంచి లీడ్స్ వేదికగా మొదలయ్యే తొలి టెస్టు కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నది. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో పోటీపడబోతున్న భారత్‌కు అనుభవలేమి ప్రతిబంధకంగా కనిపిస్తున్నది. రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల ద్వారా ఇప్పటికే ఒక అంచనాకు వచ్చిన టీమ్ మేనేజ్‌మెంట్ తుది జట్టు కూర్పుపై దృష్టి సారించింది. ఎవరిని ఏ స్థానంలో ఆడించాలనే దానిపై వ్యూహాలు రచిస్తున్నది.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

భారత క్రికెట్‌లో నవ శకానికి నాంది పడింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికకు తోడు దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న యువ క్రికెటర్లకు జాతీయ జట్టులో చోటు దక్కింది. తాము పడ్డ కష్టానికి ప్రతిఫలంగా టీమ్‌ఇండియాకు ఎంపికైన యువ క్రికెటర్లు అవకాశాలను అందిపుచ్చుకుంటూ సత్తాచాటాలని చూస్తున్నారు. ముఖ్యంగా టీమ్‌ఇండియాకు తొలిసారి టెస్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న గిల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓవైపు కెప్టెన్సీ బాధ్యతలకు తోడు కీలకమైన బ్యాటింగ్‌తో జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఏర్పడింది. అంతో ఇంతో ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవమున్న కేఎల్ రాహుల్, బుమ్రా, సిరాజ్, పంత్, జడేజా పెద్ద దిక్కుగా కనిపిస్తున్నారు. డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో తొలి టెస్టు సిరీస్ అయిన ఇంగ్లండ్‌తో పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీమ్‌ఇండియా అందుకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తున్నది. చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మార్గదర్శకత్వంలో ఇంగ్లిష్ జట్టును దీటుగా ఎదుర్కొవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడి ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడ్డ క్రికెటర్లు తొలి టెస్టుకు వేదికైన లీడ్స్‌లో సత్తాచాటేందుకు పట్టుదలతో ఉన్నారు. అయితే తుది జట్టు కూర్పుపై ఒకింత ఆసక్తి నెలకొన్నది.

నాలుగులో నాయకుడు!

ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్‌కు తోడు కేఎల్ రాహుల్ వచ్చే అవకాశముంది. ఇంగ్లండ్ గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ ఆడబోతున్న జైస్వాల్ ఏ మేరకు జట్టుకు శుభారంభం అందిస్తాడన్నది చూడాలి. ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అతడు 27.50 సగటుతో 110 రన్స్ చేశాడు. ఇంట్రాస్క్వాడ్ పోరులోనూ జైస్వాల్ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. మరోవైపు ప్రస్తుత టీమ్‌లో సీనియర్ అయిన రాహుల్‌కు ఇంగ్లండ్‌లో 34.11 సగటు ఉంది. 2018(ఓవల్)లో 149కు తోడు, 2021లో 129 పరుగులు చేసిన అనువభం రాహుల్ సొంతం. దీనికి తోడు ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండో వామప్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన రాహుల్ భారీ అంచనాలు కల్పించాడు. జైస్వాల్, రాహుల్ జట్టుకు మెరుగైన శుభారంభాన్ని ఇస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండకపోవచ్చు. కీలకమైన మూడో స్థానం కోసం సాయి సుదర్శన్, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్ మధ్య పోటీ ఏర్పడింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన సుదర్శన్‌కు కౌంటీల్లో ఆడిన అనుభవం కలిసొచ్చే అంశం. దేశవాళీలో టన్నుల కొద్ది పరుగులు చేసి దాదాపు 7 ఏండ్ల తర్వాత తిరిగి జాతీయ జట్టులోకి వచ్చిన కరణ్‌ను ఎక్కడ ఆడించాలన్నదానిపై టీమ్ మేనేజ్‌మెంట్ తర్జనభర్జన పడుతున్నది. కౌంటీల్లో ఆడిన అనుభమున్న కరణ్ తొలి మ్యాచ్‌లో డబుల్ సెంచరీ (204) చేసి తన వాడిని చూపించాడు. మరోవైపు దేశవాళీల్లో నిలకడగా రాణిస్తూ జాతీయ జట్టులో అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న ఈశ్వరన్ రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా 41.75 సగటుతో 167 పరుగులు చేశాడు. కోహ్లీ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన నాలుగో స్థానాన్ని కెప్టెన్ గిల్ భర్తీ చేయనున్నాడు. టాపార్డర్ విఫలమైతే ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారుతూ ఆటను చక్కదిద్దాల్సిన కీలక బాధ్యత గిల్ ఎత్తుకోవాల్సి వస్తుంది. ఇక ఐదో స్థానంలో రిషభ్ పంత్ రానున్నాడు. మిడిలార్డర్‌లో పంత్ దూకుడు టీమ్‌ఇండియాకు కలిసిరానుంది. సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో 37 మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు చేసిన అనుభవం పంత్ సొంతం. లోయార్డర్‌లో జడేజా ఆట చాలా కీలకం కానుంది. అటు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించే సత్తా ఉన్న జడేజా క్లిష్టమైన సమయాల్లో జట్టుకు ఆపద్భాంధవునిలా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. పేస్ ఆల్‌రౌండర్ విషయానికొస్తే శార్దుల్ ఠాకూర్, నితీశ్‌కుమార్ మధ్య పోటీ నెలకొన్నది. ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన శార్దుల్ తనపై నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. దీనికి తోడు ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం శార్దుల్‌కు అదనపు బలం కానుండగా, నితీశ్ స్థానంపై సందిగ్ధత నెలకొన్నది.

బుమ్రా సారథ్యంలో..

పేస్ దళానికి జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యం వహించనున్నాడు. దాదాపు ఆరు నెలల తర్వాత టెస్టులు ఆడబోతున్న బుమ్రా..ఇంగ్లండ్‌ను ఎదుర్కొవడంలో చాలా కీలకం కానున్నాడు. వేగానికి తనదైన స్వింగ్ జోడిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేయడంలో ఆరితేరిన బుమ్రా..టీమ్‌ఇండియాకు తురుపుముక్క. ఆదిలోనే ఇంగ్లండ్‌ను దెబ్బతీస్తే..మిగతాపనిని సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ కానిచ్చే అవకాశముంది. ఫిట్‌నెస్ సమస్యలకు తోడు పేస్ భారాన్ని అంచనా వేస్తూ బుమ్రాను సిరీస్‌లో బరిలోకి దింపాల్సిన అవసరముంది. హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. భారత పేస్ బౌలింగ్‌కు పిల్లర్‌గా భావిస్తున్న సిరాజ్ విరామం లేకుండా బౌలింగ్ చేయడంలో దిట్ట. ఐపీఎల్ లోమెరుపులు మెరిపించిన ప్రసిద్ధ్ సత్తాచాటితే టీమ్‌ఇండియా బౌలింగ్ కష్టాలు తీరినట్లే. వీరికి తోడు అర్ష్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్, కుల్దీప్‌యాదవ్ జతకలిస్తే భారత సుదీర్ఘ కల నెరవేరినట్లే.

బంగ్లా భారీ స్కోరు

తొలి ఇన్నింగ్స్‌లో 484/9

గాలె: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు.. 151 ఓవర్లలో 484/9 పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 292/3తో రెండో రోజు ఆట ఆరంభించిన బంగ్లా.. ఆరంభంలోనే కెప్టెన్ శాంతో (148) వికెట్ కోల్పోయినా అతడి స్థానంలో వచ్చిన లిటన్ దాస్ (90)తో కలిసి ముష్ఫీకర్ రహీమ్ (163) ఆ జట్టుకు భారీ స్కోరును అందించాడు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 148 రన్స్ జోడించారు. కొద్దిసేపు వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో ముష్ఫీకర్‌ను అసిత ఫెర్నాండో ఎల్బీడబ్ల్యూటీ ఔట్ చేశాక.. బంగ్లా 26 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. ఫెర్నాండో, మిలాన్, తరిందుకు తలా 3 వికెట్లు దక్కాయి.

జాతీయ స్విమ్మింగ్ టోర్నీకి తెలంగాణ జట్టు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భువనేశ్వర్ వేదికగా ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగే 78వ జాతీయ సీనియర్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ కోసం తెలంగాణ జట్టును ఎంపిక చేశారు. బుధవారం ఏడుగురితో ప్రకటించిన జట్టులో సైకత్ చటర్జీ, వర్షిత్, ఇషి అగర్వాల్, సుదీక్ష కృష్ణ, శ్వేని జీవిక, ప్రతి అగర్వాల్, తేజా సామనేని ఉన్నారు. వీరంతా వేర్వేరు విభాగాల్లో తెలంగాణ తరపున పోటీపడనున్నారు.

నష్టపోయినా..ఏ విషయంలో బాధపడలేదు!

దర్శకుడిగా 25ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు శేఖర్ కమ్ముల. సుదీర్ఘ కెరీర్‌లో తీసినవి పది సినిమాలే అయినా అవన్నీ వేటికవే ప్రత్యేకం. మానవ సంబంధాల పట్ల ప్రేమ, సామాజిక పరివర్తన కోసం తపన, మనదైన సంస్కృతిపై మమకారం ప్రధానాంశాలుగా ఆయన సినిమాలు ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఆయన ఆర్థిక అంతరాల్ని చర్చించే కథ 'కుబేర'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల బుధవారం పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

- ఈ సినిమా కథకు ప్రేరణ అంటూ ఏమీ లేదు. సమాజంలోని ఆర్థిక అంతరాల నేపథ్యంలో రాసుకున్నా. సంపన్నుడు వర్సెస్ బిచ్చగాడు..వీరి మధ్య సంఘర్షణ ఎలా ఉంటుందన్నదే కథలో ప్రధానాంశం. నిజంగా ఇలాంటి కథ చెప్పడం చాలా కష్టం. చాలా పెద్ద పాయింట్ ఇది. కానీ కథపై వర్క్ చేస్తున్న కొద్దీ ఎమోషనల్ థ్రిల్లర్‌గా తయారయింది.
- ప్రపంచంలో అన్నీ తనకే కావాలనుకునే ఒక మిలియనీర్, తనకు ఏమీ వద్దనుకునే బిచ్చగాడి మధ్య కథ నడుస్తుంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి కథ రాలేదు. ప్రజల్లో ఎంతో కొంత మార్పు తీసుకొస్తుందనే నమ్మకంతో ఈ సినిమా చేశా. తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో షూట్ చేశాం. సాంకేతికంగా రెండు సినిమాలు తీసినట్లే అనుకోవచ్చు. అందుకే చిత్రీకరణకు ఎక్కువ సమయం పట్టింది.
- కొన్ని పాత్రలు నాగార్జునగారే చేయాలనిపిస్తుంది. ఇది అలాంటిదే. బిలియనీర్ పాత్ర ఆయనకు పర్‌ఫెక్ట్‌గా కుదిరింది. నాగార్జునగారిని తెరపై చూస్తే ఏదో మ్యాజికల్ ఫీలింగ్ కలుగుతుంది. ఇప్పటికీ మన్మథుడిలా ఉంటారాయన అందుకే ఆయన్ని డిఫరెంట్ మేనరిజమ్స్, స్టైల్‌లో చూపించడం జరిగింది.
- ఇక సినిమాలోని దేవా పాత్రను ధనుష్ తప్ప మరెవరూ చేయలేరు. సినిమా చూశాక ఆడియెన్స్ కూడా అదే మాట చెబుతారు. అవుట్ స్టాండింగ్ పర్‌ఫార్మెన్స్ అనడం చాలా చిన్న మాట అవుతుంది. అంతలా తన క్యారెక్టర్‌లో లీనమైపోయారు. ఎంత కష్టమైన సీన్ అయినా సింగిల్ టేక్‌లో చేస్తారాయన. రష్మిక మందన్న క్యారెక్టర్ కూడా చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది.
- ప్రేక్షకులు 'ఇది శేఖర్ కమ్ముల మార్క్ సినిమా' అంటుంటారు. అయితే ఏదో ప్రత్యేకమైన ముద్ర కోసం నేనెప్పుడూ సినిమాలు చేయలేదు. కథకు ఏం కావాలో అదే చేశాను. 'కుబేర' కథ కూడా అంతే. మార్క్ అనేది కథ ప్రకారమే ఉంటుంది. నేను ఏ సినిమానైనా నిజాయితీగా తీస్తాను. అది 'కుబేర'లో పదింతలు కనిపిస్తుంది.
- వ్యక్తిగత జీవితంలో నేను చాలా సింపుల్‌గా ఉంటాను. ఎవరి దగ్గరా ఏదీ ఆశించలేదు. సినిమాల విషయంలో కూడా లాభాల్లో వాటా కావాలని ఏరోజూ డిమాండ్ చేయలేదు. నా పారితోషికం మాత్రమే తీసుకుంటా. దాని వల్ల చాలా నష్టపోయిన సందర్భాలున్నాయి. అయినా ఏ విషయంలోనూ బాధపడలేదు. ప్రేక్షకులు నాపై నమ్మకాన్ని ఉంచారు. దానిని నిలబెట్టుకున్నా. అది అన్నింటికంటే ఎక్కువగా ఆనందాన్నిచ్చే విషయం.

భాగ్యనగరిలో 'పెద్ది' పోరాటాలు

రామ్‌చరణ్ నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే దేశవ్యాప్తంగా భారీ హైప్ క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా ఫస్ట్‌గ్లింప్స్ ఒక్కసారి సినిమాపై అంచనాల్ని పెంచింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో ట్రైన్ సెట్‌ను తీర్చిదిద్దారు కళా దర్శకుడు అవినాష్ కొల్లా. రామ్‌చరణ్ రిస్కీ స్టంట్స్ చేస్తున్నారని, 'పుష్ప-2'తో పేరుపొందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ నబాకాంత్ ఈ ఫైట్ సీక్వెన్స్‌కు రూపకల్పన చేశారని చిత్రబృందం పేర్కొంది. భారతీయ సినీ చరిత్రలో యాక్షన్ పరంగా కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూ ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. క్రికెట్, మల్లయుద్ధంతో పాటు మరికొన్ని గ్రామీణ క్రీడల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న విడుదలకానుంది.

ఇండియా మొత్తంలో ఒక్క అమ్మాయే..

'ఈ సినిమా చూసిన తర్వాత ప్రతీ ఒక్కరికి ప్రేమతత్వం బోధపడుతుంది. థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకులు ప్రేమను గుండెల్లో నింపుకొని తిరిగొస్తారు. ఈ సినిమా ఓపెనింగ్ సీక్వెన్స్ అస్సలు మిస్ కావొద్దు. ఎందుకంటే రివర్స్ స్క్రీన్‌ప్లేతో నడిచే చిత్రమిది' అన్నారు ఫణీంద్ర నర్సెట్టి. ఆయన దర్శకత్వంలో అనంతిక సనీల్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పొయెటిక్ లవ్‌స్టోరీ '8వసంతాలు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నాయిక పాత్రకోసం క్లాసికల్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ రెండూ తెలిసిన అమ్మాయి కావాలని ఇండియా మొత్తం వెతికితే ఒక్క అమ్మాయి దొరికింది. తనే అనంతిక. ఈ చిత్రంలో ఆమె అద్భుతంగా పర్‌ఫార్మ్ చేసింది' అన్నారు. ఈ సినిమాలో తాను శుద్ధి అయోధ్య అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, కథలోని భావోద్వేగాలు ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అవుతాయని కథానాయిక అనంతిక పేర్కొంది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలు కలబోసిన చిత్రమిదని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.